

తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.60,680
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,420

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.73,500
రిటైల్ వెండి గ్రాము రూ.75.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	19
చిత్తూరు	32	24
తిరుమల	28	20
గూడూరు	32	21
నగరి	32	20



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 7 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,368 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

డాడీస్ రోడ్‌యాప్ ఆవిష్కరణ



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, డీఎస్పీ విశ్వనాథ్

శ్రీకాళహస్తి: వాహనాల రక్షణ కోసం డాడీస్ యాప్‌ను పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, డీఎస్పీ విశ్వనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యానిధి వాహన పరిరక్షణకు ఈ యాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ యాప్‌లో క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయడం ద్వారా సంబంధిత వాహనదారునికి ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. తద్వారా వాహనదారుడు తన వాహనాలను రక్షించుకోవచ్చన్నారు. తమ వాహనానికి ఇబ్బంది కలిగినా, ప్రమాదం జరిగినా, బ్లడ్‌బ్యాంకు ద్వారా అవసరమైనా, పార్కింగ్ సమస్య వచ్చినా సంబంధిత యజమాని తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని వారు సూచించారు.

17 వేల ఏళ్ల నుంచే వేదాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూర్యనారాయణమూర్తి

తిరుపతి అలిపిరి : వేదాలు 17వేల సంవత్సరాల క్రితం నుంచే ఉన్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ న్యూక్లియర్ టెక్నిక్స్ కో–ఆర్డినేటర్, ప్రముఖ న్యూక్లియర్ ఫిజిక్స్ పండితుడైన ప్రొఫెసర్ జీ.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. గురువారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని 'సనాతన ధర్మ మహిమ' అనే అంశంపై మాట్లాడారు. సనాతన ధర్మం ప్రాచీనమైనదని, శాశ్వతమైనదని, నిత్యమూ కొత్తది మాదిరిగా గోచరిస్తుందని తెలిపారు. మానవాళి ప్రయోజనాల కోసం సనాతన ధర్మాన్ని ప్రచారం చేయాలని కోరారు. ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ రుషులు సోషల్ ఇంజినీర్లని, పురాతన కాలంలో ప్రజలందరూ వారిని అనుసరిస్తూ ఎంతో ఆనందంగా జీవించారని తెలిపారు. కులపతులు ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీ.రాధేశ్యామ్, డీన్ డా ఫణియాజులు, సంయోజకులు డా హనుమత్‌శర్మ పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

పిచ్చాటూరు: మండలంలోని సురుటుపల్లి శ్రీపళ్లికొండేశ్వరాలయ పాలక మండలి సభ్యులు గురువారం ఆలయంలోని నంది మండపంలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభ్యుల్లో ఒకరైన సత్యవేడు మండలం, దాసుకుప్పంకు చెందిన ఏఎంఎం మునిచంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ ఏఎంఎం బాలాజీ రెడ్డిని చైర్మన్‌గా నియమించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకమండలి సభ్యులుగా సత్యవేడుకు చెందిన మునివేలు, మాదనపాళెంకు చెందిన మంజుల, బుచ్చినాయుడుకండ్రిగ మండలం, కనవలంబేడుకు చెందిన అజయ్‌కుమార్, వరదయ్యపాళెం మండలం, కదూరుకు చెందిన కవిత, నాగలాపురానికి చెందిన ఎస్ఎం సురేష్, సురుటుపల్లికి చెందిన చిత్ర, సత్య, ఎస్ఎస్ పురానికి చెందిన ఆనందుడుతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యునిగా ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రయోగాలు పెంచేలా.. విశ్వమంతా మెచ్చేలా!




సతీస్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) ముఖద్వారం

శ్రీహరికోట రాకెట్ కేంద్రాన్ని శాస్త్రవేత్తలు అత్యున్నతంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రయోగ వేదికలకు అనుసంధానంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక భవనాలు నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రయోగాలు నిర్వహించేలా ప్రయోగ వేదికలనూ పెంచుతున్నారు. మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా నిర్మించిన పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీస్ భవనం ఈ ఏడాదే అందుబాటులోకి తీసుకురానున్నారు. ఘన ఇంధనం తయారీకి అవసరమైన మరో 29 భవనాలను నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే ఏడాదికి 12 రాకెట్లకు అవసరమైన ఘన ఇంధనం యూనిట్లు తయారు చేసుకునేందుకు వీలు కలుగుతుందని భావిస్తున్నారు. రాకెట్ ప్రయోగించిన తర్వాత అందులోని విడిభాగాలను సేకరించి మళ్లీ ప్రయోగించేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

- వరల్డ్‌క్లాస్ స్పేస్ సెంటర్‌గా శ్రీహరికోట రాకెట్ కేంద్రం
- ఆధునిక వసతులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం దిశగా అడుగులు
- ప్రయోగ వేదికలకు అనుసంధానంగా అధునాతన భవనాలు
- ఏడాదికి 11, 12 ప్రయోగాలే లక్ష్యం

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట సమీపంలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ప్రయోగాల సంఖ్యను పెంచిదిశగా ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఇక్కడి నుంచే భారీ ప్రయోగాలు చేసేలా శ్రీహరికోట రాకెట్ కేంద్రాన్ని వరల్డ్ క్లాస్ స్పేస్ సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది నుంచి 11 ప్రయోగాలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా షార్‌లో సౌకర్యాలను పెంచుతున్నారు. భవిష్యత్‌లో ప్రయోగాల సంఖ్యను పెంచుకోవడానికి, వాణిజ్యపరంగా మరింతగా దూసుకెళ్లడానికి, గ్రహాంతర ప్రయోగాలు చేయడానికి, మానవ సహిత మిషన్‌ను ప్రయోగించేందుకు, అలాగే రాకెట్ ప్రయోగాల్లో వాడే వివిధ సాంకేతిక విభాగాలను మళ్లీ సేకరించి రీయూజబుల్ ప్రయోగాలు చేసేందుకు వసతులు పెంచుతున్నారు. రాకెట్ ప్రయోగాల సంఖ్య విపరీతంగా పెరగనున్న నేపథ్యంలో ప్రయోగవేదికలను కూడా పెంచుకోవాలని భావిస్తున్నారు. రాకెట్ ప్రయోగాల్లో ప్రయివేట్ భాగస్వామ్యం కల్పించడంతో దేశంలో చాలా వరకు స్టార్టప్ స్పేస్ కంపెనీలు వెలుస్తున్న నేపథ్యంలో ఇంటిగ్రేషన్ ఫెసిలిటీస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నిశ్చయించారు. ఇప్పటికే సుమారు 200 పైగా స్పేస్ స్టార్టప్ కంపెనీలు ఉండగా.. వీరందరికీ అవకాశాలు కల్పించాలంటే మరిన్ని రాకెట్ ప్రయోగ కేంద్రాలు ఏర్పాటు చేసి వరల్డ్‌క్లాస్ స్పేస్ స్టేషన్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి పథంలో దూసుకుపో విధంగా ప్రణాళిక రచిస్తున్నారు.



మొదటి ప్రయోగవేదిక అనుసంధానంగా పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీస్ భవనం

హు'షార్'గా..

ఒకనాడు శ్రీహరికోటలో బంగాళాఖాతం అంచున చిన్నపాటి సౌండింగ్ రాకెట్ లాంచ్ ప్యాడ్ ఏర్పాటు చేసి రోహిణి సౌండింగ్ రాకెట్ ప్రయోగాలు చేసే స్థాయి నుంచి నేడు అంగారకుడు, చంద్రుడు, సూర్యుడిపై పరిశోధనలు చేసే స్థాయికి ఎదిగారు. అదేవిధంగా నాడు విదేశాలపై ఆధారపడి ప్రయోగాలు చేసుకునే స్థాయి నుంచి నేడు ప్రపంచంలో సుమారు 38 దేశాలకు చెందిన 385 ఉపగ్రహాలను ప్రయోగించి వాణిజ్యపరంగా కూడా గుర్తింపు పొందారు. ఒకవైపు దేశ ప్రజలకు ఇస్రో ఉపగ్రహాల ద్వారా ఇంటర్నెట్, డీటీహెచ్, టెలిమెడిసన్, టెలీ ఎడ్యుకేషన్, ఆండ్రాయిడ్ టెక్నాలజీ, నావిగేషన్, వాతావరణ పరిశోధన, విపత్తులు, భూగర్భంలో ఉన్న వనరులు, దేశ సరిహద్దుల్లో ఉన్న డిఫెన్స్‌కు తగిన సేవలు అందిస్తూ దేశాన్ని సాంకేతిక పరిజ్ఞానం వైపు నడిపిస్తున్నారు. వాణిజ్యపరంగా విదేశాలకు చెందిన ఉపగ్రహాలను పంపిస్తూ విదేశీమాదక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నారు.



షార్‌లోని రెండో వెహికల్ అనుసంధానం బిల్డింగ్

- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మిషన్ కంట్రోల్‌రూంను రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీన్ని 2012 జనవరి 2న అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతులు మీదుగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ మిషన్ కంట్రోల్‌రూంను ఆదిత్య–369 సినిమాలో టైం మిషన్ డిజైన్ తరహాలో నిర్మించారు.
- మల్టీ ఆబ్జెక్టివ్ ట్రాకింగ్ రాడార్ కేంద్రాన్ని రూ.245 కోట్ల వ్యయంతో నిర్మించి 2016లో ప్రారంభించారు. ఒకేసారి పది రాకెట్‌లను ట్రాకింగ్ చేసే సామర్థ్యం కలిగి ఉండేలా ఎంటీఆర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రపంచంలో ఎంటీఆర్ ఉన్న రెండో దేశంగా ఇస్రో గుర్తింపు పొందింది. ఈ ఎంటీఆర్‌ను డిజైన్, నిర్మాణం చేయించింది ఒక తెలుగు శాస్త్రవేత్త, రిటైర్డ్ షార్ డైరెక్టర్ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్.
- రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత అందులోని విడిభాగాలను సేకరించి మళ్లీ ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. దీన్నే రీయూజబుల్ ప్రయోగాలని కూడా అంటారు. ఈ ప్రయోగాలను చేసేందుకు, అలాగే స్పేస్ షటిల్ ప్రోగ్రాం నిర్వహించేందుకు రన్‌వేను నిర్మిస్తున్నారు.
- తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖర్‌పట్నంలో మరో రాకెట్ ప్రయోగాకేంద్రాన్ని నిర్మించేందుకు స్థల సేకరణను పూర్తిచేశారు. రాబోయే రెండు మూడేళ్లలో మరో రాకెట్ కేంద్రం రాబోతోంది. ఇవన్నీ పూర్తయితే సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ ప్రపంచంలోనే వరల్డ్‌క్లాస్ రాకెట్ ప్రయోగకేంద్రంగా మారనుంది.



ఆదిత్య–369 సినిమాలో టైం మిషన్ ఆకారంలో నిర్మించిన మిషన్ కంట్రోల్ సెంటర్ భవనం

అభివృద్ధికి 'అనుసంధానం'



- మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా మరో రాకెట్ అనుసంధాన భవనం నిర్మించి ఇటీవల దీనిపై రాకెట్ ట్రయల్‌రన్ నిర్వహించారు. దీన్ని పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీస్ భవనం అని అంటారు. అంటే మొదటి ప్రయోగవేదికపై రెండు రాకెట్‌ల అనుసంధానం ఒకేసారి చేసుకునే వీలుంటుంది. దీనిపై గతనెలలో పీఎస్ఎల్‌వీ రాకెట్ ఇంటిగ్రేషన్ ట్రయల్‌రన్ చేసి విజయం సాధించారు. ఈ భవనం ఈ ఏడాదిలోనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకురానున్నారు.
- ఒకే సారి రెండు రాకెట్లను అనుసంధానం చేసేందుకు రూ.628.95 కోట్లు వ్యయంతో రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ నిర్మించారు. మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ ఇప్పటికే వాడుకలో ఉండగా భారీ రాకెట్‌ల ప్రయోగాలను పెంచేందుకు రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌ను పూర్తిచేశారు. దీన్ని ప్రధాని నరేంద్రమోదీ చేతులు మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఇక్కడ కూడా ఒకేసారి రెండు రాకెట్‌లను అనుసంధానం చేసుకునే వీలు కలుగుతుంది. ఈ ఏడాది ఆదిత్య–ఎల్1 ప్రయోగానికి రెండో అసెంబ్లింగ్ బిల్డింగ్ వేదిక కానుంది.



ఒకేసారి పది రాకెట్‌లను ట్రాకింగ్ చేసేందుకు వీలుగా నిర్మించిన మల్టీ ఆబ్జెక్టివ్ ట్రాకింగ్ రాడార్ సెంటర్

- ఘనం ఇంధనం తయారీకి అవసరమైన మరో 29 భవనాలను రూ.226 కోట్లుతో నిర్మిస్తున్నారు. వీటిని పూర్తిచేస్తే భవిష్యత్‌లో ఏడాదికి 12 రాకెట్‌లకు అవసరమైన ఘన ఇంధన యూనిట్లు తయారు చేసుకునే వీలు కలుగుంది. దీన్ని మరో ఒకటన్నర సంవత్సరం లోపు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూ.300 కోట్ల వ్యయంతో రెండో ప్రయోగవేదికను నిర్మించారు. 5–5–2005న ఈ ప్రయోగవేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ–6తో మొదట ప్రయోగం చేశారు. దీన్ని అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతులు మీదుగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

నేడు జగనన్న విదేశీ విద్యాదీవెన

- కలెక్టరేట్‌లో తొలి విడత కార్యక్రమం
- విదేశాల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు రూ.98,52,164
- మొదటి విడతలో రూ.24,63,041 జమచేయనున్న ప్రభుత్వం

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. పేదరికంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కారాదన్న ఉద్దేశంతో వినూత్న పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందజేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా వీరికి శుక్రవారం మొదటి విడత మొత్తం రూ.24,63,041ను జమచేయనుంది. ఈ మేరకు అధికారులు కలెక్టరేట్‌లో జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఎస్సీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి కొమ్మల పూడి జీవన్‌ప్రకాష్, బీసీ వెల్ఫేర్ నుంచి రాస్కాగారి ఝాన్సీ రాణి, నాగవరం బాబు రంజిత్ ఎంపికయ్యారు. ఈ ముగ్గురికీ రూ.98,52,164 ఫీజును ప్రభుత్వమే నాలుగు విడతల్లో చెల్లించనుంది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

నా కల నెరవేరింది



మాది గూడూరు నియోజకవర్గం, కోట గ్రామం. నేను కజకిస్థాన్ దేశంలోని అల్మటీ పరిధిలోని ఫర్‌బీకజక్ నేషనల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చేయడానికి అవకాశం దక్కింది. మొత్తం ఫీజు రూ.24,01,600. దీన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఇలా ఏ ప్రభుత్వం చేయదని భావిస్తున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. నా కల నెరవేరింది.

–కొమ్మలపూడి జీవన్‌ప్రకాష్, కోట గ్రామం, తిరుపతి జిల్లా

చాలా సంతోషంగా ఉంది



నేకు అమెరికాలోని న్యూయార్క్ యూనివర్సిటీలో ఎంఎస్ ఇన్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీర్ అండ్ ప్లానింగ్ చదువుకోవడానికి అవకాశం లభించింది. చాలా సంతోషంగా ఉంది. నా చదువుకు రూ.52,50,564 ఖర్చు అవుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–రాస్కాగారి ఝాన్సీరాణి, బాలక్రిష్ణాపురం, తిరుపతి

ఎంతో ప్రయోజనం



మాది తిరుపతిలోని లక్ష్మీపురం సమీపంలోని నారాయణపురం. కెనడాలోని వెష్టరన్ యూనివర్సిటీలో ఎంఎస్ కంప్యూటర్ సైన్స్ చేయడానికి అవకాశం దక్కింది. నా చదువుకు రూ.22 లక్షలు ఖర్చవుతుంది. ఈ మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది. సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు. –నాగవరం బాబు రంజిత్, నారాయణపురం, తిరుపతి

ముక్కంటి ఆలయంలో శివరాత్రి శోభ



ఆలయంలో ముగ్గులు వేస్తున్న కార్మికులు



ఆలయ గోపురాలకు వెల్ల వేస్తున్న కార్మికులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈనెల 13 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని అధికారులు, పాలక మండలి సభ్యులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయం లోపల రంగురంగుల రంగవల్లికలు తీర్చిదిద్దుతున్నారు. భిక్షాల గాలిగోపురం, రంగుల గోపురం, శివయ్య గోపురం, తిరుమంజన గోపురం, దక్షిణ గాలిగోపురాలకు విద్యుత్ అలంకరణలు, కటౌట్ పనులు శరవేగంగా పూర్తిచేస్తున్నారు. అలాగే స్వామి, అమ్మవార్ల రథాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి కొత్త రంగులు అద్దుతున్నారు. భక్తులు సేద తీరేందుకు రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు శాశ్వతప్రతిపాదికన మరుగుదొడ్ల నిర్మిస్తున్నారు. మహాశివరాత్రి పనులను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.



స్వామి, అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్న కార్మికుడు



ఆలయంలో రూపుదిద్దుకుంటున్న రంగవల్లులు



భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్లు

ప్రజలను రెచ్చగొట్టేందుకే లోకేష్ పాదయాత్ర

- సత్యవేడు ఎమ్మెల్యే ధ్వజం

వరదయ్యపాళెం: ప్రజలను రెచ్చగొట్టేందుకే టీడీపీ నాయకుడు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విమర్శించారు. గురువారం సత్యవేడు అటవీశాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక వారి మధ్య చిచ్చుపెట్టే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోను చెత్తబుట్టలో పడేసి ఐదేళ్ల పాటు ప్రజలను మోసం చేస్తే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల కోసం మ్యానిఫెస్టోను పూజగదిలో ఉంచి మూడున్నరేళ్లలో 98 శాతం హామీలు అమలు చేశారని చెప్పారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ సెజ్ అంచెలంచెలుగా అభివృద్ధి చెంది 220 పరిశ్రమల ఏర్పాటుతో 60వేల మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారని వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో స్థానం

సీఎం జగనన్న అధికారంలోకి వచ్చాక చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సమున్నత స్థానం కల్పించారని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ హయాంలో స్వయాన చంద్రబాబే ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని తమను అవమానించిన విషయాన్ని ఎప్పటికీ మరిచిపోలేమని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా గెలవలేని టీడీపీ నేత లోకేష్, సీఎం జగన్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. లోకేష్‌కు సీఎం జగన్ గురించి మాట్లాడే స్థాయి, అర్హత రెండూ లేవన్నారు. ముందుగా ఆయన ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనుకున్నారో బహిరంగంగా వెల్లడించి ఆ తర్వాతే పాదయాత్ర చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సోమశేఖర్, రైతు సలహా కమిటీ అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మూడో రోజు.. అదే జోరు

- ఉత్కంఠభరితంగా సాక్షి ప్రీమియర్ లీగ్
- సీనియర్, జూనియర్ విభాగాల్లో మ్యాచ్‌లు
- ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరుస్తున్న క్రికెటర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపం తుమ్మలగుంటలోని క్రికెట్ మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మూడవ రోజైన గురువారం క్రికెటర్లు జోరు కొనసాగింది. సీనియర్, జూనియర్ విభాగాల్లో చెరో మూడు మ్యాచ్‌లు చొప్పున 6 మ్యాచ్‌ల్లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచి ఆకట్టుకున్నారు. ఐపీఎల్ తరహాలో జరుగుతున్న ఈ లీగ్ పోటీల్లో ఎలాగైన ఫైనల్స్‌కు చేరాలనే పట్టుదలతో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారు. చూడచక్కని షాట్లతో ఫోర్లు, సిక్సర్లతో భారీ ఇన్నింగ్స్ నెలకొల్పగా.. వారికి అండగా బౌలర్లు టపటపా వికెట్లు పడగొడుతూ.. పరుగులకు అడ్డుకట్ట వేస్తూ జట్టును విజయతీరానికి చేర్చడంలో కీలక భూమిక పోషించారు.

SAKSHI MEDIA GROUP




క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

గ్రౌండ్ 1 సీనియర్స్ విభాగంలో..

మొదటి మ్యాచ్‌లో మదనపల్లి మిట్స్ కళాశాల జట్టుపై కలికిరి సీకాం కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మిట్స్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన సీకాం జట్టు 8 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 80పరుగులు చేసి గెలుపొందింది. రెండవ మ్యాచ్‌లో చిత్తూరు వేము-1 కళాశాల జట్టుపై మదనపల్లి విశ్వం కళాశాల జట్టు 27 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విశ్వం జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేయగా వేము జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులు మాత్రమే చేసింది. మూడవ మ్యాచ్ విశ్వం-2, వేము-2 జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. వేము-2 జట్టు రాకపోవడంతో అంపైర్లు బై విశ్వం-2 జట్టుకు బై ఇస్తూ విజేతగా ప్రకటించారు.

గ్రౌండ్ 2 జూనియర్స్ విభాగంలో..

మొదటి మ్యాచ్‌లో శ్రీవిద్యానికేతన్ డిప్లొమో కళాశాల జట్టుపై ఎస్వీ ఐటీఐ జట్టు 4 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీ ఐటీఐ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 71పరుగులు చేయగా శ్రీవిద్యానికేతన్ డిప్లొమో జట్టు 10 ఓవర్లో 4 వికెట్ల నష్టానికి 67పరుగులు చేసింది. రెండవ మ్యాచ్‌లో ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టుపై తిరుపతి ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీజీపీ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేయగా.. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎమరాల్డ్స్ జట్టు 8.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 73పరుగులు చేసింది. మూడవ మ్యాచ్‌లో రామాపురం ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టుపై వేము పాలిటెక్నిక్ కళాశాల జట్టు 38 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన వేము పాలిటెక్నిక్ జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 109పరుగులు చేయగా ఎమరాల్డ్స్ జట్టు 10ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 71పరుగులు మాత్రమే చేసింది.

SPL SAKSHI PREMIER LEAGUE

విజేత జట్లు

గ్రౌండ్-1
1. సీకాం కలికిరి డిగ్రీ కళాశాల జట్టు
2. మదనపల్లి విశ్వం-1 కళాశాల జట్టు
3. మదనపల్లి విశ్వం-2 కళాశాల జట్టు (బై)

గ్రౌండ్-2
1. ఎస్వీ ఐటీఐ జట్టు
2. తిరుపతి ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు
3. వేము పాలిటెక్నిక్ కళాశాల జట్టు



కలికిరి సీకాం డిగ్రీ కళాశాల జట్టు



ఎస్వీ ఐటీఐ జూనియర్స్ జట్టు



మదనపల్లి విశ్వం-1 సీనియర్స్ జట్టు



వేము పాలిటెక్నిక్ జూనియర్స్ జట్టు



తిరుపతి ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు

బడ్జెట్‌లో రాష్ట్రంపై వివక్ష చూపిన కేంద్ర ప్రభుత్వం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తిరుపతి కల్చరల్: బడ్జెట్‌లో మన రాష్ట్రానికి సున్నకు సున్నా చుట్టి కేంద్ర ప్రభుత్వం దగా చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. తిరుపతి ఎంబీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన చట్టాలను ఆమోదించి పదేళ్లయినా కేంద్ర బడ్జెట్‌లో హామీల ప్రస్తావన కానీ, నిధుల కేటాయింపు గానీ జరగలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు 35 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, కేంద్రం తన బాధ్యత కాదని చేతులెత్తేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తూ ప్రకటించిన బడ్జెట్‌లో చంద్రబాబు కేంద్ర బడ్జెట్ సమగ్రంగా ఉందని కితాబివ్వడం చూస్తే రాష్ట్ర ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటకకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరిగి పక్కనున్న ఆంధ్రాకు సున్నా ఇవ్వడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు అన్ని పార్టీలు కలిసి కేంద్రంపై పోరాడాలన్నారు. అందుకు వామపక్షాలు సమాయత్తం అవుతున్నాయన్నారు. ధరలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. విశాఖ ఉక్కుపై కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావన జరగలేదన్నారు. సోలార్ ప్రాజెక్టు పేరుతో ఆదానీకి 75 వేల ఎకరాలను రైతుల నుంచి ప్రభుత్వమే దగ్గరుండి లీజుకిప్పిస్తోందన్నారు. ఆదానీకి ఇచ్చిన లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శి వర్గ సభ్యుడు ఎ.పుల్లయ్య పాల్గొన్నారు.

ఏమార్చి..రూ.50 వేలు కాజేసి!

- ఏటీఎం కార్డు మార్చి నగదు కాజేసిన కేటుగాడు

చంద్రగిరి: కొత్తగా తీసుకున్న ఏటీఎం కార్డును యాక్టివేట్ చేయించాలని ఆ కేటుగాడిని కోరిన మహిళలకు తన కార్డు కాకుండా వేరొక కార్డు ఇచ్చి, ఆపై రూ.50 వేల నగదును విత్ డ్రా చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం.. మండల పరిధిలోని అగరాల పంచాయతీ, బండకాడపల్లికి చెందిన తంగమ్మకు చంద్రగిరి ఎస్బీఐ(ఏడీబీ) బ్యాంకులో ఖాతా ఉంది. గురువారం ఆమె బ్యాంక్‌కు వెళ్లి పాత ఏటీఎం కార్డుకు బదులుగా కొత్త కార్డును తీసుకుంది. అనంతరం బ్యాంకు దిగువ అంతస్తులో ఉన్న ఏటీఎం సెంటర్‌కు చేరుకుంది. కార్డు యాక్టివేషన్ చేయడం తెలియకపోవడంతో తన ఏటీఎం కార్డును యాక్టివేషన్ చేయాలని అక్కడకు వచ్చిన ఓ అపరిచిత వ్యక్తిని కోరింది. దీంతో ఆ వ్యక్తి ఏటీఎం యాక్టివేషన్ చేశానని, 24 గంటల్లో కార్డు యాక్టివేట్ అవుతుందని నమ్మబలికి తన వద్ద ఉన్న వేరొక కార్డు ఇచ్చి పంపించాడు. ఇంటికి వెళ్లిన కొంత సేపటి తర్వాత తన ఖాతాలో నుంచి రూ.50 వేలు విత్‌డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. బాధితురాలు బ్యాంకు అధికారులను సంప్రదించింది. తన వద్ద ఉన్న ఏటీఎం కార్డును అధికారులకు చూపించగా, ఆ కార్డు తంగమ్మది కాదని వారు నిర్ధారించారు. తనను నమ్మించి నగదును కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుయాలో గుర్తుతెలియని మృత శిశువు

తిరుపతి తుడా : రుయా చిన్నపిల్లల ఆస్పత్రిలో గుర్తుతెలియని నవజాత శిశువు మృతదేహం వెలుగుచూసింది. ఆ మృత శిశువును అధికారులు గురువారం రుయాలోని మార్చురీకి తరలించారు. స్థానికుల కథనం.. అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన ఓ గర్భిణి రెండు రోజుల కిందట తిరుపతిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. నెలలు నిండకనే కాన్పు కావడంతో బిడ్డ ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఈ క్రమంలో ఇద్దరు వృద్ధులు ఆ శిశువును చికిత్స నిమిత్తం బుధవారం రుయాలోని చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చేర్పించి తల్లి వివరాలు చెప్పకనే వెళ్లిపోయారు. అప్పటికే ఆ శిశువు ఆరోగ్యం విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో శిశువుకు సంబంధించిన కేషీట్లో ఉన్న ఫోన్ నంబరుకు ఫోన్ చేయగా... ఎంతకీ పనిచేయలేదు. ఒక రోజు వరకు ఎదురుచూసి ఇక చేసేదిలేక మార్చురీకి తరలించారు.

రైల్లో వ్యక్తి మృతి

తిరుపతి క్రైం: కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 45 సంవత్సరాలు గల ఓ వ్యక్తి కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి చేరుకున్నాడు. అయితే ఆ రైలు అర్ధరాత్రి తిరుపతికి చేరుకోవడంతో అక్కడ ఉన్న పారిశుద్ధ్య కార్మికులు రైల్లోని జనరల్ బోగీలో క్లీన్ చేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడు ఆచూకీ తెలిస్తే తిరుపతి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

మద్యానికి బానిసై..మనస్తాపానికి గురై..



మృత దేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

గూడూరు: భార్య వదిలేసి వెళ్లిపోయిందన్న మనస్తాపంతో, మద్యానికి బానిసై మనోవేధనకు గురైన ఓ యువకుడు ఉరి వేసుకని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వరరావు వివరాల మేరకు.. రెండవ పట్టణంలోని చింపిరినాయుడుపేట ప్రాంతానికి చెందిన అన్నంగి నరేష్(36) అనే వ్యక్తిని అతని భార్య 9 ఏళ్ల క్రితం వదిలేసి వెళ్లిపోయింది. ఈ మేరకు నరేష్ అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. అప్పుడప్పుడూ రైల్లో వెండర్‌గానూ, సమీపంలో ఉన్న ఓ ప్రయివేటు పరిశ్రమలో పనిచేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఇటీవల కూడా నరేష్ రైల్వే ట్రాక్‌పై పడుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం రాత్రి నరేష్ పడుకున్న ఇంట్లోని రాడ్‌కు కేబుల్ వైర్ వేసి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రలోభాలకు గురికాకుండా పనిచేయండి

- ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్లలో ఎస్పీ తనిఖీ



ముత్యాలరెడ్డి పోలీస్‌స్టేషన్ సిబ్బందితో ఎస్పీ..

తిరుపతి క్రైం: ప్రలోభాలకు గురికాకుండా పనిచేయాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మహిళలు, చిన్న పిల్లలకు అండగా నిలవాలని సూచించారు. గురువారం ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్‌లో ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం పలు విషయాలపై సిబ్బందితో చర్చించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో పూర్తిచేయాలని, సైబర్ నేరాల పట్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు.

పనితీరు మెరుగుపడాలి

రేయింబవళ్లు గస్తీ తిరిగే బ్లూ కోల్ట్స్, రక్షక్ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరు మెరుగుపడాలని ఎస్పీ ఆదేశించారు. అత్యవసర సమయాల్లో రాత్రి వేళల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్ నుంచి డయల్ 100, ఎస్ఓఎస్ కాల్స్‌పై వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. స్టేషన్ పరిధిలోని కేడీలు, బీసీలు పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరుపై సమీక్షించి, వారికి దశాదిశను నిర్దేశించారు. యాంటీ డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నగరంలోని పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి

తనిఖీల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ కేసులు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సాధించాలని ఎస్పీ ఆదేశించారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కువ భాగం హైవే రహదారి ఉన్నందున రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

ఆకస్మిక తనిఖీలు నిర్వహించండి

బస్సు స్టేషన్, రైల్వే స్టేషన్, ఆలయాలు, హోటళ్లు, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విసిబుల్ పోలీసింగ్ చేసి, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆయన సూచించారు. ఏఎస్పీ కులశేఖర్, తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప, తిరుపతి ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు శివప్రసాద్ వెస్ట్, చంద్రశేఖర్ పిళ్లై, సురేంద్రరెడ్డి, రవీంద్రనాథ్, రాజశేఖర్, తులసీరాం, శివప్రసాద్‌రెడ్డి ఈస్ట్, అబ్బన్న, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

జీవవైవిధ్యానికి చిత్తడి నేలలు అవసరం



మాట్లాడుతున్న డీఎఫ్ఓ శామ్యూల్

దొరవారిసత్రం : చిత్తనేలలు జీవవైవిధ్యానికి చాలా అవసరమని సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్ఓ శామ్యూల్ అన్నారు. గురువారం ప్రపంచ చిత్తడినేలల దినోత్సవం సందర్భంగా నేలపట్టు పక్షుల కేంద్రం వన్యప్రాణి విభాగం అధికారులు మావిళ్లపాడు గ్రామంలోని ఆదర్శపాఠశాలకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థులతో దొరవారిసత్రం నుంచి పక్షుల కేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం పర్యావరణ కేంద్రం వద్ద చిత్తడి నేలలు, పక్షుల ప్రాధాన్యత వంటి అంశాలపై డీఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓ వరప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ చిత్తడి నేలలు గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండలన్నారు. నేలపట్టు, పులికాట్ ప్రాంతాల్లో చిత్తనేలలు ఉండడం వల్ల ప్రతి ఏటా క్రమం తప్పకుండా విదేశీ వలస విహంగాల సంఖ్య పెరుగుతోందన్నారు. ఎఫ్ఎస్ఓ బాలయ్య, ఉపాధ్యాయుడు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

- టీటీడీ ఈఓ ధర్మారెడ్డి
- ఘనంగా ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న ఈఓ ఏవీ.ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి: యోగా, ధ్యానం, క్రీడలు, వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని పరేడ్ మైదానంలో గురువారం ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించి సంస్థ ప్రతిష్టను ఇనుమడింపజేస్తారని వెల్లడించారు. అంతకుముందు ఈవో ఉద్యోగుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పావురాలు, బెలూన్లు ఎగురవేసి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలు ఫిబ్రవరి 19వ తేదీ వరకు నిర్వహిస్తారు. జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, వీజీవో మనోహర్, సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత పాల్గొన్నారు.

కర్ణాటక వర్సిటీ పాలక మండలి సభ్యుడిగా సర్జన్‌రావు



తిరుచానూరు : బీదర్‌లోని కర్ణాటక వెటర్నరీ, అనిమల్, ఫిషరీస్ సైన్సెస్ పాలకమండలి సభ్యునిగా తిరుపతి శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ కాప సర్జన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కేసీ వీరన్న గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగుతారు. డాక్టర్ సర్జన్‌రావు అసోసియేట్ డీన్‌గా, ఇన్‌చార్జ్ డీన్‌గా, విద్యార్థి వ్యవహారాల డీన్ గా, ఇన్‌చార్జ్ కంట్రోలర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన సేవలకు గుర్తుగా ఈపదవి వరించింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.